సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
చిత్తూరు తిరుపతి
మంగళవారం | 1 అక్టోబర్ 2024 | పేజీలు 10

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

### జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు

**చిత్తూరు క్రైమ్, మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు ఆదేశించారు. సోమవారం నగరంలోని స్థానిక ఏఆర్ పోలీసు కార్యాలయంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీ చిత్తూరు డీఎస్పీ టి.సాయి నాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదు దారులకి న్యాయం చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు.



## అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 187 అర్జీలు... జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా అర్థవంతంగా పరిష్కారంకోసం చూపాలని, అలసత్వం వహించ రాదని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్, డిఆర్ఓ పెంచల్ కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, దేవేంద్ర రెడ్డిలతో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు.

**శాఖల వారీగా అర్జీల వివరాలు...** రెవెన్యూ శాఖ-120, పంచాయతీరాజ్ శాఖ-8, డిఆర్‌డిఏ-15, పోలీస్ శాఖ-6, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్-4, స్కిల్ డెవలప్మెంట్-1, మునిసిపల్ కార్పొరేషన్ - 9, విద్యుత్-1, పశుసంవర్ధక-1, అగ్నిమాపక-1, ఐసిడిఎస్ పిడి-1, వైద్య ఆరోగ్యశాఖ-2, పౌరసరఫరాలశాఖ -3, కోపరేటివ్ సొసైటీ -1, పిడి డ్వామా - 6, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ - 1, సోషల్ ఆడిట్ -1, వ్యవసాయ శాఖ -1, నేషనల్ హైవే -2, డిఇఓ -1, బీసీ కార్పొరేషన్ -1, వెరసి మొత్తం 187 వినతులు రావడం జరిగిందని అధికారులందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యతగా, అర్థవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.




# ప్రైవేట్ మద్యం దుకాణాలపై అధికారపార్టీ నేతల చూపు



బినామీలతో నడిపేందుకు రంగం సిద్ధం చేస్తున్న నాయకులు

ఎక్సైజ్ అధికారులతో రహస్య చర్చలు

నేడు నోటిఫికేషన్ వెలువడే అవకాశం

**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** మద్యం వ్యాపారంపై కొంతమంది అధికార పార్టీకి చెందిన కూటమి నాయకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. ఎలాగైనా ఈ ప్రైవేట్ మద్యం దుకాణాలను ఇతరులకు ఎవరికి దక్కకుండా తామే దక్కించుకోవాలని, దీనికోసం ఎంత వరకైనా తెగించాలని భావిస్తున్నారు. కొత్తపాలసీ ప్రకారం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యాపారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో బినామీ పేర్లలో వాటిని దక్కించుకుని మద్యం వ్యాపారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని దాంతో కోట్ల రూపాయలను సంపాదించుకోవచ్చునని భావిస్తున్నారు. ఇందుకోసం ఎక్సైజ్‌శాఖలో కొంతమంది అధికారులకు పరోక్షంగా ప్రతిపాదనలు పంపినట్టు తెలియవస్తోంది. అంతేకాదు ఇటీవల బదిలీల్లో సిఫారసుల లేఖలు

మిగతా 2లో

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను నిర్ణీతగడువు లోపు పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోపల పరిష్కారంతోపాటు అధికారులు అర్థవంతంగా సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్,జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్ఓ బి.పుల్లయ్యలతో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారవేదికలో భాగంగా అందిన అర్జీలను జిల్లా శాఖాధిపతులు క్షేత్ర స్థాయిలో తమ సంబంధిత సిబ్బందితో పరిష్కరించాలని, కాలయాపాయన చేయరాదని ఆదేశించారు. పరిష్కారం అయ్యే సమస్యలను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని, పరిష్కారం కాని సమస్యలకు గల కారణాలను ఫిర్యాదు దారునికి అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, డిఆర్ఓలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 85 ఫిర్యాదులు

### ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు : ఎస్పీ

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లా నలుమూలల నుండి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి జిల్లా ఎస్పీ 85 ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించి సకాలంలో విచారించి చట్ట పరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో

మిగతా 2లో



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 85 ఫిర్యాదులు

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్‌స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని ఆ ఫిర్యాదులను కూడా ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణి స్తామని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు జిల్లా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రావిమనోహర ఆచారి శాంతిభద్రతలు, నాగభూషణరావు నేర విభాగం వారు పాల్గొన్నారు.

## తిరుమలలో సిట్ బృందం




**తిరుమల, మేజర్‌న్యూస్:** కల్తీ నెయ్యి వ్యవహారంపై తిరుమలలోని ఫ్లోర్ మిల్, ల్యాబ్‌లో 4 గంటలకు పైగా సాగిన సిట్ విచారణ. నెయ్యిని పరీక్షించే విధానం, ల్యాబ్ సామర్థ్యం, సిబ్బంది నైపుణ్యంపై విచారించిన సిట్. మంగళవారం లడ్డూ, అన్నప్రసాదాల తయారీ విధానాన్ని పరిశీలించి పాటు అధికారులు, కార్మికుల నుండి వివరాలు సేకరించే అవకాశం. 3వ రోజు దర్యాప్తు ముగించుకొని తిరుమల నుండి తిరుపతికి బయలుదేరిన సిట్ బృందం.

## గ్రామ సభలు విజయవంతం చేయాలి

**శ్రీకాళహస్తి, మేనేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అక్టోబర్ 2025-2026 ఆర్థిక సంవత్సరంనకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోవు పనులు ప్రజలు భాగ స్వామ్యంతో ఎంపిక చేయుటకు గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకంలో ఏఏ పనులు చేపట్టవచ్చునో గ్రామ సభలో చర్చించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా సివి శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతిలో జరుగుతున్న పెర్క్యులేషన్ పనిని తనిఖీ చేసి కూలీలతో ఈ పని వల్లన కలుగు ప్రయోజనాలను పథక సంచాలకులు వారు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా రైతులకు ఇస్తున్న పళ్ళ. పూల తోటలు వివరాలు తెలియజేసి వారు పళ్ళ, పూల తోటలూ పెంపకం చేపట్టునట్లు చర్యలు తీసుకోవాలని సిబ్బంది ని ఆదేశించారు. ప్రతీ రోజూ రూ.300లు కూలీ పొందేటట్లు వేతన దారులు పనులూ చేయాలని కోరారు.అదేవిధంగా మొబైల్ యాప్ లో కూలీలు రెండు పూటలా పనులు చేస్తున్నపుడు అటెండెన్స్. పనులు వద్ద ఫోటోలు అప్లోడ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధనపు కార్య క్రమాధికారులు. చంద్ర శేఖర్ రాజు. అవిలాల దేవరి. జూనియర్ ఇంజనీర్ పంజాడ బాలాజీ రావ్. ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్. కూలీలు పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న భరత్ శర్మ ప్రవచనం

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్:** అవధాన కళామార్తాండ శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ వామనావతార వైభవము ప్రవచనం అందర్నీ ఆకట్టుకుంది. హిందూ ధర్మ రక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రజల్లో ఆధ్యాత్మికతను, భక్తి భావాన్ని పెంపొందించే దిశగా, టిటిడి.. అన్నమా చార్య ప్రాజెక్ట్ హిందూ ధర్మప్రచార పరిషత్ ద్వారా అనేక ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్ర మాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం అన్నమాచార్య కళామందిరంలో తిరుపతికి చెందిన శతావధాని, అవధాన కళా మార్తాండ ఉప్పలధడియం భరత్ శర్మ., వామనావతార వైభవంపై ప్రవచనం చేశారు. ఈ ప్రవచనంలో వామనావతార వైభవంతో పాటు బలి చక్రవర్తి వృత్తాంతము, శ్రీమహావిష్ణువు లీలల ఆంతర్యం, నేటి సమాజా నికి పురణాల ద్వారా అందే సందేశం, పోతన భాగవతంలోని పద్యాల వైభవముపై పద్యాలను రాగయుక్తంగా ఆలపిస్తూ ప్రవచనాన్ని కొనసాగించారు. ఆద్యంతం హృద్యంగా సాగిన ప్రవ చనం ఆహుతులను అలరించింది. ప్రవచనకర్త ఉప్పలధడియం భరత్ శర్మను అన్నమాచార్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ కోకిల, రాయలసీమ రంగస్థల చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, చిగోరా ఆధ్యాత్మిక సేవాకేంద్రం వ్యవస్థాపకులు చిత్రపు హనుమంతరావు శాలువాకప్పి సత్కరించారు.



## శాప్ చైర్మన్ రవి నాయుడుకి ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాప్ చైర్మన్‌గా నియమితులైన అనిమిని రవి నాయుడుని శ్రీకాళహస్తి పట్టణం తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలతో సత్కరించి. ముక్కంటి తీర్థప్రసాదాలు అందించారు. రవి నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్ని విధాలుగా క్రీడాభివృద్ధికి తన వంతు సహాయం చేస్తానని తెలియ జేయడం జరి గింది. ఈ కార్యక్ర మంలో నింద్ర సుధాకర్. గుత్తా విజయ నాయుడు. హిమత్ తదితరు లు పాల్గొన్నారు.



# ప్రైవేట్ మద్యం దుకాణాలపై అధికార పార్టీ నేతల చూపు

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన సందర్భంలోనే ఈ ప్రతిపాదనను వారి ముందుంచారని కూడా చెబుతున్నారు. తమకు తమవారికి తప్ప ఇతరులకు ఎవరికి మద్యం దుకాణాలు రాకూడదని కూడా వారు కరాకండిగా పరోక్షంగా బెదిరింపులకు గురి చేసినట్లు కూడా తెలుస్తోంది. మద్యం విక్రయాల పై రాష్ట్ర ప్రభుత్వం కొత్తపాలసీని అమలు చేసేందుకు నిర్ణయించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలను పూర్తిగా రద్దుచేసి, ప్రైవేటు వ్యాపారులకు అప్పగించేలా కొత్తపాలసీని రూపొందించింది. దీనిప్రకారం కేవలం చిత్తూరు జిల్లాకు మాత్రమే 140 పైగా దుకాణాలు కేటాయించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని దుకాణాలకు లాటరీ పద్ధతిలో కేటా యించేలా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దుకాణం కోసం దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తు ఫీజు కింద రూ.రెండు లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. దుకాణం దక్కకనిపక్షంలో ఆ మొత్తం తిరిగి వెనక్కి ఇవ్వరని కూడా స్పష్టం చేసింది. లైసెన్స్ ఫీజును ఏడాదిలో ఒకేసారికాకుండా దశలవారీగా చెల్లించే వెసులుబాటును కల్పించ డంతో దుకాణాలకు పోటీ ఎక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

**అధికారం మాది అన్ని మాకే...** ఇదిలావుండగా మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతి నిధులు, నేతలు, పెద్దల ఆశీర్వాదం కలిగిన కార్యకర్తలు సైతం ప్రయ త్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల ఎక్సైజ్‌శాఖలో బదిలీలు జరిగిన సందర్భంలో తమకు అనుకూల మైనా అధికారులను కీలక పోస్టులో నియమించేందుకు ఎవరికి వారు వారి బలంతో ఇప్పటికే ప్రయ త్నించేశారు. తమకు అనుకూలమైన అధికారులు తమ కోరే దుకాణా లు తమకు వచ్చేలా సహకరించాలని ఆదేశించినట్లు కూడా తెలు స్తోంది. తాము తమకు అవసరమైన బినామీలతో దుకాణాలకు దరఖాస్తు చేయిస్తామని, కీలకమైన ప్రాంతాల్లో షాపులు మాకే లాటరీ లోనైనా వచ్చే విధంగా ఎలాగైనా చూడాలని వారిని కోరినట్టు తెలు స్తోంది. ఇదిలా ఉండగా కొత్త మద్యం పాలసీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సోమ, మంగళ వారాలలో విడుదల చేసే అవకాశం ఉండడంతో దుకాణాల కోసం ఆసక్తి చూపుతున్న ప్రజాప్రతినిధులు, నేతలు ఎలా అయినా దక్కించుకోవడానికి అనుస రించాల్సిన వ్యూహాలపై తమ అనుచరులతో మంతనాలు జరుపుతు న్నారు. వీలైనన్ని ఎక్కువ దుకాణాలను దక్కించుకోవడంద్వారా మద్యం వ్యాపారాన్ని తమ గుప్పిట్లో ఉంచుకోవాలని వారంతా తహతహలాడు తున్నారని సమాచారం.

అయితే బయటకు మాత్రం సిండికేట్ పేరుతో కొందరు వ్యాపారులను తెరపై వుంచి తెరవెనుక తామే అన్ని చూసు కునే విధంగా అన్ని సిద్ధం చేసుకున్నట్లు తెలియ వచ్చింది. రిటైల్ వ్యాపారంలో సిండికేట్‌కు సైతం మంతనాలు, ప్రభుత్వం మద్యం దుకాణం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించే రేట్ల తోనే మద్యం విక్రయాలు విక్రయించవలసి ఉంటుంది అయితే ప్రభుత్వం నిర్ణయించడం ధరలతో మద్యం విక్రయిస్తే కనీసం వారు ప్రభుత్వానికి చెల్లిస్తున్న ఫీజు కూడా అందుతుందో లేదో అని భావిస్తున్న కొంతమంది ఇదే సమయంలో ముందస్తుగానే రిటైల్ అమ్మకాల్లో సైతం ఎలాంటి అవరోధాలు లేకుండా సిండికేట్‌గా మారి బాటల్‌పై ఐదో పదో అధికంగా నిర్ణయించి విక్రయించేందుకు కూడా మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రవేట్ మద్యం దుకాణాలకు గతంలో 40% నుండి 27% వరకు కమిషన్లను ఇచ్చేది అయితే ప్రస్తుతం ఆ కమీషన్లు ఎంత మేరకు ఇస్తారో పూర్తిగా సమాచారం లేకపోవడంతో ఎలాగు మద్యం దుకాణాల కోసం సిండికేట్ అయినట్లు అమ్మకాల్లో కూడా సిండికేట్‌గా మారి దుకాణాలను నిర్వహిస్తే లాభాలు ఘటించవచ్చునని కొంతమంది ఆలోచనలతో పాటు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని కూడా రహస్య సమాచారం.

## విద్యార్థులకు అభినందనలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఈనెల 28న సెట్విన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు శ్రీవెంకటేశ్వర మ్యూజిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ పీజీ కళాశాలకు చెందిన విద్యార్థినిలు పాల్గొని కవిత్వము, వ్యాసరచన, చిత్రలేఖనం విభాగాలలో ఏడు మంది విద్యార్థినిలు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను అందుకున్నారు. అలాగే శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం 70వ వార్షికోత్సవంను పురస్కరించుకొని డైరెక్టరేట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యా లయం వారు సెప్టెంబర్ 13వ తేదీ వ్యాసరచన, వకృత్వము, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీపద్మావతి మహిళా పీజీ కళాశాల విద్యార్థినిలు పాల్గొని ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను గెలుపొందారు. ఈ మేరకు సోమవారం పోటీలలో విజేతలుగా గెలుపొంది బహుమతులు సాధించిన విద్యార్థి నులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సాంస్కృతిక కమిటీ కన్వీనర్ కె.నాగపద్మ, డాక్టర్ లక్ష్మి, సంధ్య, టి.హేమలత, డాక్టర్ కే.శ్యామల, డాక్టర్ టికే.పద్మజ, పాల్గొని విజేతలను అభినందించారు.



# విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాం పంపిణీ

**వాకాడు, మేజర్‌న్యూస్:** మండల క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు జాలాది కిషోర్, మేరీ సునీత దంపతుల తనయుడు అబ్రహం జోసెఫ్ పాల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వాకాడు ఎంపీపీ స్కూల్ విద్యను అభ్యసిస్తున్న 50 మంది విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంను పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో వాకాడు మండల పరిషత్ పాఠశాలలోని ఎంఈఓ బివి.కృష్ణయ్య, స్కూల్ కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు పి.ప్రవీణ్ కుమార్, స్థానిక పాస్టర్లు రెవ. యన్ ప్రశాంత్ బాబు, పీసీ దయాకర్‌లు జాలాది అబ్రహం జోసెఫ్ కొరకై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎంఈఓ కృష్ణయ్య మాట్లాడుతూ కుమారుని కోల్పో వడం బాధాకరమని ఆ కుటుంబం లను భగవంతుడు ఆశీస్సులు ఉంటాయని ఆయన తెలిపారు. అనంతరం, చెన్నైలో విద్యను అభ్యస స్తున్న జాలాది కిషోర్, మేరీ సునీతల కుమార్తె జాలాది ఆశ్రిత ఏంజెలిన్ తన సోదరుని పేరిట తన బీటెక్ కోర్స్‌లో ఇంటర్న్ షిప్ నందు స్కాలర్ షిప్‌గా పొందిన రూ.25వేలతో విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంను కొనుగోలు చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల వక్తలు, కార్యక్రమ ముఖ్య అతిథులు జాలాది ఆశ్రిత ఏంజెలిన్ ను ప్రత్యేకంగా అభినందించారు. పై కార్యక్రమంలో ఆ పాఠశాల సహోపాధ్యాయురాలు ప్రసూన, అజయ్ కుమార్, మహిపతి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## టమోటా ఆధారిత ఉత్పత్తులపై అవగాహన

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** రాస్ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం శాస్త్రవేత్త శ్రీలత ఆధ్వర్యంలో ఆర్కే బీబీపేట పంచాయతీలో ప్రధమ తరహా ప్రదర్శన క్షేత్ర ము అనే కార్యక్రమంలో మహిళలకు టమోటాలో విలువ జోడించి విలువ ఆధారిత ఉత్పత్తులు మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. టమోటాలు తక్కువ ధరలో ఎక్కువ దొరికే సీజనల్ నిల్వ ఉంచి వివిధ రకాల పదార్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిడీపిఓ కార్యకర్తలు సూపర్వైజర్లు మహిళలు పాల్గొన్నారు.



## ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్లు వినియోగించుకోండి

**ఐరాల, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు గ్రామ పంచాయితీలలో ఉన్న ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లను గ్రామ పంచాయితీ ప్రజలు వినియోగించుకోవాలని ఐరాల ఈఓపిఆర్డీ కుసుమకుమారి అన్నారు. సోమవారం మండ లంలోని పుత్రమద్ది, మిట్టూరు, నాగవాండ్లపల్లి, మొరంపల్లి పేరయ్యగారిపల్లి గ్రామ పంచాయ తీలలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాలను సోమవారం పునః ప్రారంభం చేసినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు. ఈ చెత్త నుండి సంపద కేంద్రాలను గ్రామపంచాయతీ ప్రజలు విని యోగించుకోవలని ఈఓపిఆర్డీ కోరారు.



## రమణ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని కాగితి గ్రామపంచాయతీ పెద్దూరుకు చెందిన ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు రమణ తల్లి మృతి చెందారని తెలిసిన వెంటనే పలమనేరు నియోజకవర్గం శాసన సభ్యులు నూతన కాల్వ అమరనాథ్ రెడ్డి రమణ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.



## మహిళలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** మహిళలు తమకు ఎదరైయే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఎస్‌విఏ ప్రభుత్వ పురుషులు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. సోమవారం కళాశాలలో మహిళా విభాగం తరపున ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె విద్యార్థినులు కళాశాలలో సమాజంలో క్రమశిక్షణతో ఓర్పుతో నడుచుకోవాలని హితవు పలికారు. డబ్ల్యూఈఎస్ కన్వీనర్ డా తులసి కళాశాల కమిటీ క్రమశిక్షణ పై ప్రత్యక ద్రుష్టి సారించాలని కోరారు. అధ్యాపకురాలు సునీత అమ్మాయిలు సమస్యలు ఏవైనా ఉంటే పిర్యాదు బాక్స్‌లో రాత పూర్వకంగా వేయాలని సూచించారు. కళాశాలలో వైద్య కేంద్రం పనితిరును వివరించారు. రుద్రమదేవి సమాజంలో మహిళలు ప్రాధాన్యతని తెలిపారు. కార్యక్రమంలో శివలక్ష్మి, లావణ్య, రాజేంద్రుడు పాల్గొన్నారు.



## భారతదేశంలో విద్య కాషాయీకరణ

### కోటి ఉద్యోగాలు ఎక్కడ మోడీ? పీడీఎస్‌యూ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** భారత దేశంలో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీ కరణ అవుతోందంటూ ప్రగతిశీలప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ విమర్శించారు. అందుకు ఆంధ్రరాష్ట్రం కూడా ఎర్రతివాచీ పరుస్తోంద ని ధ్వజమెత్తారు. శ్రీకాళ హస్తి పట్టణం ఆక్స్‌ఫోర్డ్ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మోడీ పాలనలో విద్య కార్పొరేటీకరణ అవుతున్న తీరును రాజశేఖర్ ఎండగట్టారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ 11ఏళ్లు దాటి పోతున్నా కనీసం 1100 ఉద్యోగాలు కూడా ఇవ్వ లేదని ఎద్దేవా చేశారు. యూనివర్సిటీల్లో అశాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించే పాఠ్యాంశా లను మోడీ ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగా సమస్యలను పక్కకు నెట్టి తిరుపతి లడ్డు వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కారణమైన జీవోలు 84. 83,117లను వెంటనే రద్దు చేయాలన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీలకి సీట్లు ఇవ్వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లెటర్‌ని వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం నూతన తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ఎస్.జాకీర్, ఉపాధ్య క్షులుగా నరేంద్ర, కార్యదర్శిగా లోకేష్, సహాయకార్యదర్శిగా మని, కోశాధికారిగా రిజ్వాన్ ఎన్నికయ్యారు.



## నేషనల్ కాపు యూత్ ప్రెసిడెంట్‌గా చైతన్య, ప్రధానకార్యదర్శిగా గజేంద్ర

**పలమనేరు, మేజర్‌న్యూస్:** జాతీయ కాపు సంఘం నుండి నేషనల్ యూత్ ప్రెసిడెంట్‌గా పలమనేరు పట్టణానికి చెందిన పూల చైతన్యను, జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆకుల గజేంద్రను నియమిస్తున్నట్లు జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. జాతీయ యువఅధ్యక్షులుగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీక రించిన పూల చైతన్య, ఆకుల గజేంద్ర జాతి అభ్యున్నతి కోసం అలుపెరగ కుండా పోరాడతామని తెలిపారు



## వారాహి మహా రథయాత్ర విజయవంతం

### సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు మహా రుద్ర వారాహి

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** సెప్టెంబర్ 22వ తేదీన తిరుపతి ఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీ వారాహి మహా రథయాత్ర 28న విజయవంతంగా విశాఖపట్నంలో ముగిసిందని స్థానిక తిరుచానూరులోని ఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మహారుద్ర వారాహి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ వారాహి మహా రథయాత్ర విజయవంతం కావడానికి సహకరించిన రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, ఏఎస్పి రవి మనోహరా చారి, ఈస్ట్ పోలీస్ స్టేషన్ డిఎస్పి వెంకట నారాయణ, ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణ ఆచారి, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, కాకినాడ జిల్లాల ఎస్పీలకు, అలాగే విజయ వాడ, ఏలూరు రేంజి డిఐజి, విజయవాడ, విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీస్(సిపి) లకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, వీరందరికీ వారాహి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ముఖ్యంగా అక్టోబర్ 3వ తేదీ నుంచి తిరుచానూరులోని ఆదివారాహి ఆలయంలో శ్రీదేవి శరన్నవ రాత్రులు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 2వ తేదీ కలశ స్థాపన, 3 నుంచి అమ్మవారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారికి పూజా కార్యక్రమాలు, చండి, వారాహి యాగాలు నిర్వ హించబడుతుందని, కార్య క్రమంలో భాగంగా భక్తుల కు మధ్యాహ్నం, సాయంత్రం ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించామ న్నారు. శరన్నవరాత్రులలో భాగంగా వారాహి దీక్ష తీసుకునేవారు ఆలయంలో సంప్రదించాలని కోరారు. 7వ తేదీ పంచమి తిధి రోజున ఆదివారహి ఆల యంలోని మూల విరాట్‌కు అనేక రకాలైన ఫల, పుష్పాలు, కుంకుమ, సుగంధ ద్రవ్యా లతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందా లని ఆయన పిలుపునిచ్చారు.



## ప్రభుత్వం లడ్డు విషయాన్ని రాజకీయం చేయడం బాధాకరం

### కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కల్తీ నెయ్యితో తయారుచేసిన శ్రీవారి లడ్డు విషయాన్ని రాజకీయ ప్రయో జనాల కోసం వాడుకోవడం బాధాకరమని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీకేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ సోమవారం సుప్రీంకోర్టులో కల్తీ నెయ్యి విషయంపై వాదనలు జరిగాయి. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి లడ్డూను రాజకీయాల్లోకి ఎందుకు తీసుకొచ్చారు? కల్తీకి ఆధారాలు మీ వద్ద ఉన్నాయా? తొందరపడి నిర్ణయాన్ని ఎందుకు ప్రకటించారని ప్రశ్నలు అడగ్గా.. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా సమాధానం చెప్పలేక తెల్ల మొహం వేశాడని ఎద్దేవా చేశారు. చంద్ర బాబు తొందరపడి ప్రకటన చేసి పొరపాటు చేశాడని ఆనాడే తాను చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుత ఈఓ శ్యామలరావు కూడా అదే పొరపాటు చేశాడన్నారు. ఇన్ని నియమాలు, నిబంధనలు పాటించే టిటిడి ఉన్నతాధికారులు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కుమారుడు తిరుమల వచ్చినప్పుడు సాయంకాల సమయంలో ఏ పద్ధతి ప్రకారం దర్శనం కల్పించారని, ఆ సమయంలో ఆయన పక్కన ఏ అధికారి ఉన్నాడో టీటీడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానికు లుగా తమకు ప్రతి మంగళవారం ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనం కావాలని అడిగితే ఇవ్వని టిటిడి అధికారులు నిన్నటి రోజున ఒక చిన్న నాయకుడు సిఫార్సు చేస్తే 20 మందికి దర్శనం ఏ ప్రాతిపదికన కల్పించారో సమాధానం చెప్పాలన్నారు. జగన్‌ను చూసి కూటమి ప్రభుత్వం ఎందుకు భయపడుతుందో అర్థం కావడం లేదన్నారు. తిరుపతిలో పోలీసులరాజ్యం నడుస్తోంది కాబట్టే 30యాక్ట్ అమలులో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా, ఇప్పటివరకు సూపర్ సిక్స్ అమలు కాలేదని, ఉచిత బస్సు ప్రయాణం కోసం మహిళలు ఎదురు చూస్తున్నారన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఎందుకు ఇప్పటి వరకు అలా చేయలేదని నిలదీశారు. వీరి వైఖరిని ఎవరూ ధైర్యంగా అడగలేకపోతున్నారు. కానీ తనకు ఆ దమ్ముందని,ఇకనైనా వారి వైఖరి మార్చుకోవాలని సున్నితంగా హెచ్చరిస్తున్నారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, అమీజ్ మజీద్ పటేల్, తేజోవతి, ముని శోభ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అనువాదంతోనే భాషా విజ్ఞానం విస్తృతం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** అనువాదమనేది చాలా విస్తృతాంశమని, భాషాజ్ఞానం లేకుండా అనువాధం చాలా కష్టమని, భాషాజ్ఞానాన్ని సంపాదించి తద్వారా వివిధ భాషలలోని జ్ఞానాన్ని విస్తృతం చేయడం ద్వారా అందరికీ విజ్ఞానం లభిస్తుందని శ్రీవేంక టేశ్వర విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.సి.హెచ్. అప్పారావు తెలిపారు. అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జాతీయ సంస్కృత విశ్వవిద్యాల యంలోని అనువాద విభాగం ద్వారా ట్రాన్సలేషన్ టెక్నిక్స్ అండ్ చాలెంజస్ అనే అంశంపై రెండురోజుల కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా ఎస్వీయూ విసి ప్రొ.సి.హెచ్.అప్పారావు విచ్చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. సంస్కృతభాషలోని గొప్ప గ్రంథాలను భారతీయభాషలలోకి అనువదించనపుడు ఆ జ్ఞానం అందరికీ అందుతుందని తెలియజేశారు. ప్రొ.కొంపెల్ల రామసూర్య నారాయణ అనువాదం అవసరాన్ని, సంస్కృతం నుండి తెలుగు భాషలోకి అనువదించే సందర్భంలో వచ్చే సమస్యలు, అనువాదం చేసేటప్పుడు అనుసరించవలసిన టెక్నిక్స్, సంస్కృతం తెలుగు భాషల ఘనిష్ట సంబంధం, ఏ విధంగా సంస్కృతం నుండి తెలుగుకి, తెలుగు నుండి సంస్కృతంలోకి అనువాదం చేయాలో ఉదాహరణలను వివ రించారు. విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణ మూర్తి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని అనువాద విభాగం ద్వారా అనువాదం ఏవిధంగా చెయ్యాలో అనే అంశంపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రత్యేకించి సంస్కృతంలోని గ్రంథాలను భారతీయ భాషలలోకి అనువాదం చేసే ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్ళాలనే సత్సంకల్పంతో ముందుకు వెళ్ళుతున్నామని వివరించారు. బి.ఎ, ఎమ్.ఎ, సర్టిఫికేట్, డిప్లొమో కోర్సులు అనువాద విభాగం ద్వారా బోధిస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా అందరికి అంతర్జాతీయ అనువాద దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట వక్తగా విచ్చేసిన విద్వాన్ జనార్దన్ హెగ్డే, అకడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత శక్లా, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ.ఎన్.లతా, డా.ఎమ్.జి.నందన రావు, డా.కనపాల కుమార్ విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.



# వచ్చిన సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

## - నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్:** నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 12 ఫిర్యాదులు వచ్చినట్లు నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై నగర ప్రజలు అర్జీలు సమర్పించారు. అర్జీల పరిష్కారంపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో కమిషనర్ చర్చించారు. ఫిర్యాదులు, వినతులకు సంబంధించి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. అనంతరం గత వారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు.



సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ 8, రెవెన్యూ 2, ప్రజారోగ్య విభాగం 1, ప్రధాన కార్యాలయం 1 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ. ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంతృప్తి పడేలా ఫిర్యాదుల పరిష్కారం : కమిషనర్

**తిరుపతి, మేజర్‌న్యూస్:** పిర్యాదుదారులు సంతృప్తి పడేలా ప్రజాపిర్యాదుల పరిష్కారం ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమంలో 47 వినతులు వచ్చాయి. తమ వీధిలో చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉండి ఇండ్లమీదపడేలా ఉంది తొలగించాలని, త్రాగునీరు నిర్దిష్ట సమయంలో సరఫరా చేయాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పలువురు కమిషనర్ కు వినతులు అందించారు. అన్ని వినతులను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ ఏ వారం వచ్చిన వినతులు వారం లోపు పరిష్కరించాలని, లేని యెడల అర్జీదారుడిని కలసి వివరించాలని అన్నారు. అయా విభాగాలకు వచ్చిన వినతులకు వారే పరిష్కరించి, వారికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, డి.ఈ లు, సెక్రటరీ రాధిక, ఏ.సి.పి బాలాజీ, రమణ, రెవిన్యూ ఆఫీసర్ సేతుమాదవ్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసీమ్, అకౌంటెంట్ రమేష్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.



# బీసీసీఐ సెక్రటరీ జైషాకు వీడ్కోలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవారిని దర్శించుకుని రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న బీసీసీఐ సెక్రటరీ జైషాని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్ బాబు, ఏసీఏ స్టేట్ ఇన్ ఫ్రా కమిటీ చైర్మన్, చిత్తూరు డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్(క్రికెట్ విజయ్) సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి వీడ్కోలు పలికారు.

# కుంకి ఏనుగులు గంగన్న శిరస్సు ప్రాజెక్టులపై జాప్యం వద్దు

## - ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డి

**పలమనేరు, మేజర్ న్యూస్:** పలమనేరు నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే కుంకి ఏనుగుల ప్రాజెక్టు, గంగన్న శిరస్సు ప్రాజెక్టుల అనుమతుల అంశంలో అధికారులు ఏమాత్రం జాప్యం చేయొద్దని ఎమ్మెల్యే ఎన్. అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం పలమనేరు సబ్ డివిజన్ పరిధిలోని అటవీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎఫ్ ఆర్ వో గా బాధ్యతలు చేపట్టిన నారాయణ ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు. దసరా తర్వాత కుంకి ఏనుగుల ప్రాజెక్టుపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం ఇప్పటికే గుర్తించిన స్థలాన్ని, ప్రాజెక్టుకి అయ్యే అంచనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఇక తాగునీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేయనున్న గంగన్న శిరస్సు ప్రాజెక్టు రెండో దశ క్లియరెన్స్ పనులలోను ఏమాత్రం అశ్రద్ధ వహించొద్దని త్వరితగతిన ప్రాజెక్టుల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డి,ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సురేంద్ర ఎఫ్.బి.వో లు తదితరులు పాల్గొన్నారు.



### ఎస్‌టిల హ్యాబిటేషన్లలో జనన, ఆధార్ సర్టిఫికేట్లు

# మంజూరు ప్రక్రియ ఈనెల 15 లోపు పూర్తి చేయండి

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్ మేజర్‌న్యూస్:** జిల్లాలోని 588 ఎస్‌టి హ్యాబిటేషన్లలో ఇంకనూ జనన, ఆధార్ సర్టిఫికేట్లు లేని వారికి వీటి మంజూరు ప్రక్రియ ను నవంబర్ 15 లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తహసిల్దార్లు,ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా లోని ఆర్‌డిఓలు అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీఓలతో ఎస్ టి హ్యాబిటేషన్లలో జనన, ఆధార్ సర్టిఫికెట్లకు మంజూరు పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పథకాలను పొందడానికి ఆధార్ ముఖ్యమని,జిల్లాలోని ఎస్.టీ హ్యాబిటేషన్లలో సుమారుగా 60 వేల మంది ఎస్ టీ లు కలరని, వీరిలో ఇంక నూ ఆధార్ లేకపోవడం తో ప్రభుత్వ పథకాలు పొంద లేక పోతున్నారని, వీరందరినీ సర్వేలో గుర్తించి 100 శాతం ఆధార్ కార్డు మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్ కార్డు మంజూరుకు మొదటిగా జనన ధ్రువీకరణ పత్రం అవసరమని ఇది లేని వారికి ఎంపీడీఓలు జనన ధ్రువీకరణ పత్రమును మంజూరు చేయాలన్నారు. సంచార ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆధార్ కార్డు మంజూరుకు తహసిల్దార్లు చర్యలు చేపట్టాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం లేనివారికి ఎంపీడీఓ లు నిర్ధారించి సర్టిఫికెట్లు మంజూరు చేయడం ద్వారా ఆధార్ నమోదు కు అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ ను త్వరితగతిన పూర్తి చేసే విషయంలో విఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు పూర్తిగా నిమగ్నం కావాలన్నారు. అక్టోబర్ 10వ తేదీ లోపు సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అక్టోబర్ 25 లోపు బర్త్ సర్టిఫికెట్లు మంజూరు డిజిలైజేషన్ పూర్తిచేసి నవంబర్ 15లోపు ఆధార్ కార్డుకు అప్లోడ్ చేయాలన్నారు. తద్వారా ఎస్టీ కుటుంబాలు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులవుతారని అన్నారు. ఆధార్ కార్డు పొందడం ద్వారా రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, పెన్షన్ ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హులవుతారని ఈ దిశగా మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జనన,మరణ ధ్రువపత్రాల మంజూరులో నోటరీ అవసరం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని సెక్రటరీ లు పరిశీలించి సర్టిఫికెట్లను మంజూరు చేయాలన్నారు. దీనితో పాటు ల్యాండ్ రికార్డ్స్ కూడా డిజిటలైజేషన్ చేయాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్ డి ఓ లు, తహసిల్దార్లు ఎంపీడీఓ లు పాల్గొన్నారు.



### సీఎంని కలసిన వన్నియకుల క్షత్రియ సంఘం రాష్ట్ర కార్యదర్శి పెజయ్‌కుమార్

**చిత్తూరు అర్బన్ మేజర్‌న్యూస్:** సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నా యుడుని అమరావతి లోని సచివాలయం నందు ఆంధ్రప్రదేశ్ వన్నియకుల క్షత్రియ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. విజయ్ కుమార్ మర్యాద పార్వకంగా కళాశారని, ఈ సందర్భంగా అయన చిత్తూరు నియోజక వర్గం, జిల్లా రాజకీయ పరిస్థులను గూర్చి చర్చించడం జరిగిందని తెలిపారు.



# పాదిరేడు ప్లాట్లు సందర్శించిన అధికారులు

తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్: వనమాల పేట మండలంలో టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన పాదిరేడు, పల్లం ఏరియాల్లో ఉన్న భూమి స్థలాలను అధికారులు, హౌసింగ్ సొసైటీ, ఉద్యోగ సంఘ నాయకులుసందర్శించారు. అనంతరం టీటీడీ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ నాయ కులు ఇఓ శ్రీ శ్యామలరావుకి వినతిపత్రం ఇచ్చారు. దానిపై స్పందించిన ఇఓ పూర్తి వివరాలు ఇవ్వాలని వారికి తెలియజేశారు. కాగా సోమవారం టీటీడీ వెల్ఫేర్ అధికారి ఆనంద్‌రాజ్, ఎస్టేట్ అధికారి గుణభషణరెడ్డి, ఈఈ నర్సింహామూర్తి హౌసింగ్ సొసైటీ, ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు. అధికారులను పలు సమస్యలు పరిష్కరించాలని, పనులను వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు. అదే విధంగా ఇఓతో ఒక సమావేశం బ్రహ్మోత్సవాల తరువాత నిర్వహించాలని కోరినట్లు వారు తెలిపారు.






## ఆయుష్మాన్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పోస్టర్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మరియు సిబ్బందితో కలిసి విడుదల చేసిన జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ యోజన 6 వ వార్షికోత్సవం సందర్భంగా ఆయుష్మాన్ పఖ్వాడా వేడుకలలో భాగంగా ఆయుష్మాన్ భారత్ వైద్య శిబిరంను వైద్య సేవ పథకంచే గుర్తించిన తిరుపతి జిల్లాలోని అన్ని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులలో ఉచిత ఓ పి సేవలు నిర్వహించారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ యోజనను ప్రధాని మోదీ సెప్టెంబర్ 23, 2018 న ప్రవేశ పెట్టి, నేటికి ఆరేళ్ళు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆయుష్మాన్ పఖ్వాడా ను నిర్వహిస్తున్నారు అని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ప్రయోజనాల గురించి అవగాహన కార్యక్రమాలు, 70 ఏళ్ళు పైబడిన అర్హులకు ఆయుష్మాన్ కార్డులను మంజూరు చేయనున్నారని అన్నారు. మిలియన్ల మంది యొక్క ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకు రావడానికి , ప్రతి ఆయుష్మాన్ కార్డు న్యాయమైన సంరక్షణ, ఆశ మరియు ప్రాముఖ్యతను సూచిస్తుందని, ఆరోగ్యకరమైన భారత దేశాన్ని తయారు చేయడమే ఈ పథక యొక్క లక్ష్యం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీహరి, డా.ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ రాజశేఖర్, జిల్లా డా. ఎన్టీఆర్ వైద్య సేవ మేనేజర్ శివకుమార్, డి సి హెచ్ ఎస్ ఆనందమూర్తి , తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ శిక్షణ పనితీరు నిర్వహణ భేష్

**- ఎన్‌సిసి డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ గుర్బీర్‌పాల్ సింగ్**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎన్‌సీసీ బెటాలియన్ నిర్వహణ, విద్యార్థులకు, క్యాడేట్లకు అందించే శిక్షణ పని తీరు భేషుగ్గా ఉందని డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ గురుబీర్ పాల్ సింగ్ తెలిపారు. తిరుపతిలోని ఎన్‌సిసి గ్రూప్ కమాండెంట్ ప్రధాన కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ గురుబీర్ పాల్ సింగ్ మాట్లాడుతూ దేశంలోని ప్రధాన శిక్షణ కేంద్రాలను పరిశీలించేందుకు పర్యటిస్తున్నానని, ఇందులో భాగంగా సోమవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రధాన శిక్షణ కేంద్రమైన తిరుపతిని సందర్శించడం జరిగిందన్నారు. ఇక్కడ నేషనల్ కార్ప్స్ (ఎన్‌సిసి) శిక్షణ శిబిరాలు, ఎన్‌సిసి అధికారులు విద్యార్థులకు అందించే వివిధ రకాలైన సౌకర్యాలు, ఇతర శిక్షణ నైపుణ్యాభివృద్ధిలో ఎంతో మెరుగ్గా ఉన్నాయని కొనియాడారు. భవిష్యత్తులో ప్రతి రాష్ట్రానికి ఒకటి ఒక ప్రత్యేకమైన ఎన్‌సిసి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఢిల్లీలో వివిధ దశలలో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగా తిరుపతిని కూడా ప్రధాన కేంద్రంగా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

**ఎన్‌సిసి క్యాడెట్‌లచే సన్మానం...**



ఎన్సిసి క్యాడెట్ల భావం క్రమశిక్షణ పద్ధతులను పరిశీలించిన డైరెక్టర్ జనరల్ వారి అత్యుత్తమ ప్రదర్శనకు తగిన బహుమానంతో అభినందించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్యాడెట్లను గార్డ్ ఆఫ్ హానర్ తో అభినందించారు. సమీక్ష తర్వాత, డీజీకి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వి ఎమ్ రెడ్డి, రీజియన్ ఎన్‌సిసి కార్యకలాపాలు చొరవలపై అంతర్దృష్టిని అందించిన తిరుపతి గ్రూప్ గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా వివరించారు. క్యాడెట్‌లకు శిక్షణ, అవకాశాలను మరింత పెంపొందించే లక్ష్యంతో కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చలు జరుపుతూ తిరుపతి గ్రూప్ అధికారులతో కూడా ఆయన సంభాషించారు. అధికారులు, క్యాడెట్‌లు చూపిన నిబద్ధతకు డిజి అధికారులను ప్రశంసించారు. యువతలో నాయకత్వం, పాత్ర, పౌర బాధ్యతను పెంపొందించడంలో వారి ప్రయత్నాలను కొనసాగించాలని వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎన్‌సిసి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి గొడుగులకు పూజలు

**- శ్రీవారికి గోపాలకృష్ణ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే ఆరణి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** గత 11 సంవత్సరాలుగా శ్రీవారి బ్రహ్మోత్సవాల చెన్నైకి చెందిన అలిమేలు మంగమ్మ అండ్ ట్రస్ట్ వారు గొడుగులు అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు చెన్నైకి చెందిన అలిమేలు మంగమ్మ అండ్ ట్రస్ట్ వారు గొడులుతో సోమవారం తిరుపతిలోని శ్రీకోదండరామ స్వామి ఆలయం వద్దకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విచ్చేసి శ్రీవారి గొడుగులకు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి గొడుగులు శ్రీకోదండరామస్వామి అలా అధికారులు డెప్యూటీ ఈవో నాగరత్నమ్మ. ఏఈవో రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్. కాపునాడు సరిత నాగరాజు రాయల్, భక్తులు ఘన స్వాగతం పలికి శ్రీకోదండరామాలయం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విచ్చేసి శ్రీవారి గొడుగులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా గత 8 ఏళ్లుగా కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల వేంకటేశ్వరస్వామి వారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా 4 గొడుగులను, అలా శ్రీకోదండరామునికి రెండు గొడులను అత్యంత భక్తి ప్రపత్తులతో అందస్తున్నామని తెలిపారు. ఈ ఏటా స్వామివారి పట్ల భక్తి శ్రద్ధలతో తాము తయారు చేసిన ఆరు గొడులతో తిరుపతికి చేరుకున్నామన్నారు. రాముల వారి ఆలయం వద్ద పూజలు చేసి అనంతరం రాముల వారికి రెండు



గొడుగులు సమర్పించి మిగిలిన 4 గొడుగులను తిరుమల శ్రీవారికి సమర్పించి స్వామివారిని దర్శించుకుంటామని తెలిపారు. ప్రతి ఏటా గొడుగులను అర్పించేలా అభగవంతుడు కల్పించిన అనుగ్రహంగా తాము భావిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాను ప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, వూకా విజయ్ కుమార్, టీటీడీ మాజీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, ఆర్కట్ కృష్ణ ప్రసాద్, కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, నారాయణ, నైనారు శ్రీనివాసులు, గుండాల గోపినాథ్ రెడ్డి, కృష్ణయ్య, ఎస్వీఎం వెంకటేష్, ఆముదల తులసీదాస్, సింగంశెట్టి సుబ్బరామయ్య, నరసింహులు నాయుడు, జయ కుమార్, రాజారెడ్డి, బాబ్జి, నైనారు మహేష్ యాదవ్, శరత్ కుమార్ పాల్గొన్నారు.

## వరద బాధితులకు విజయం విద్యాసంస్థ రూ. 10 లక్షల విరాళం

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం విజయం విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు కళాశాల యాజమాన్యం పది లక్షల 116 రూపాయలను అందజేయదలచారు. ఇందులో భాగంగా సోమవారం ఉండవల్లిలో పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే మురళి మోహన్ విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజ మూర్తి, ఆకాడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శైలజ మూర్తి ఈ మేరకు నగదు చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు అందజేశారు. ఇటీవల కాణిపాకం బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా గణనాథుని ఆలయంలో నిర్వహించిన లడ్డూ వేలంలో 21 కిలోల కలిగిన ప్రసాదాన్ని విజయ విద్యాసంస్థల అధినేత ఎం. తేజోమూర్తి రూ.4,25,000 లకు దక్కించుకున్నారు. ఆ ప్రసాదాన్ని సైతం ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల ఏ వో రాజగోపాల్, లైసన్ ఆఫీసర్ రమేష్ బాబు పాల్గొన్నారు.





## గుంతలు పోర్చండి సారూ

**- ప్రమాదాలకు నిలియంగా రహదారులు...**

**రామచంద్రపురం మేజర్‌న్యూస్:** వర్షాలు పడుతుండటంతో ప్రమాదాలకు నిలయంగా ఆర్అండ్‌బి రహదారులు మారాయి. పరమాల నుంచి అనుప్పల్లి వరకు ఉన్న ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఉండడంతో వర్షపు నీరు చేరి చెరువులు తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులకు రోడ్డుపై నీటిలో గుంతలు కనిపించక ప్రమాదాల బారినపడి ఆసుపత్రుల పాలు అవుతున్నారు. టీటీ కండ్రిగ సమీపంలో ఉన్నా గుంతలలో సోమవారం సాయంత్రం ద్రూచక్ర వాహనం బోల్తా కొట్టి ఇరువురికి గాయాలయ్యాయి. ఇకనైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు పూడ్చాలని, రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్లపదలను తొలగించమని పలువురు కోరుతున్నారు.

## క్రీడాభివృద్ధిలో వేగం పెంచుదాం - తెలుగుదేశం

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో గత పాలకుల అనాలోచిత నిర్ణయాలు వలన నిర్వీర్యమైన క్రీడా రంగాన్ని గాడిలో పెట్టి రాష్ట్రాన్ని క్రీడాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో క్రీడాభివృద్ధిలో వేగం పెంచుదామని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్‌గా ఇటీవల నూతనంగా నియమితులైన



తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిమిని రవి నాయుడుకి టీడీపీ, నియోజకవర్గ నాయకులతో కలిసి ఉమేష్ ఆధ్వర్యంలో స్వర్గీయ ధ్యాన్ చంద్ చిత్రపటాన్ని బహూకరించి. దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ యువకుడైన రవి నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడా రంగాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్ళాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, క్రికెట్ కోచత దుర్గా ప్రసాద్, టి.యన్.యస్.యఫ్. నాయకుడు కోబాకు లక్ష్మణ్, బి.ఇడి.కళాశాల ప్రిన్సిపాల్ డా.తంగరాజన్, ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ పురుషోత్తం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో కొండ మల్లీశ్వరస్వామి



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని మాంబేడు పంచాయితీ డిఆర్ అండ్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కొండ మల్లీ శ్వర స్వామిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్యనిర్వహులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నమయ్య కీర్తనలతో భక్తులను అలరింపజేశారు

## బ్రాహ్మణపల్లిలో జోరుగా పారిశుద్ధ్యం పనులు



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ కేంద్రంలో సోమవారం పారిశుధ్య పనులు సర్పంచ్ శిరీష చాణిక్య ప్రతాప్, ఈవోపీఆర్డి పురుషోత్తం ఆధ్వర్యంలో జోరుగా సాగాయి. గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాల్లో ఉన్న పారిశుద్ధ్య పనులను చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు. ఎగువ బ్రాహ్మణపల్లి, దిగువ బ్రాహ్మణపల్లి, కమ్మ కండ్రిగ, డంపింగ్ యార్డ్ లో ఉన్న చెత్తాచెదారాలను తొలగించడంతోపాటు గ్రామాల చుట్టూ ఉన్న పారిశుధ్య పనులను జోరుగా చేశారు. అంటూ రోగాలకు దూరంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిడిఓ రితేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ ఓపెన్ తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన పవన్ కుమార్

**- పవన్ కు క్రీడా సంఘాల అభినందనలు**



**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** గోవాలో ఈ నెల 28, 29 తేదీలలో జరిగిన విఫా జీ విన్ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో తిరుపతికి చెందిన పవన్ కుమార్ గోల్డ్ మెడలను కైవసం చేసుకున్నారు. గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలకు ఐదు దేశాలకు చెందిన క్రీడాకారులు 2000 మందికి పైగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో పవన్ కుమార్ కని శెట్టి 75 కేజీల విభాగంలో కైరోజి (ఫైటింగ్)లోబ్లాక్ బెల్ట్ సీనియర్ కేటగి రిలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. నిర్వాహకుల చేతుల మీదుగా బంగారు పత కాన్ని పవన్‌కుమార్ అందుకున్నారు. తిరుపతికి జిల్లాకు చెందిన పవన్ కుమార్ అంతర్జాతీయ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల జిల్లాలోని టైక్వాండో క్రీడాకారులతో పాటు పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా అభినందించారు.

## మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం




**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పుంగనూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎస్ అలీమ్ బాషా ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కౌన్సిలందరూ హాజరై వారి వార్డులోని సమస్యలపై మాట్లాడుతూ వారి వార్డులలో తాగునీటి సమస్య, వీధిలైట్లు సరిగా వెలగలేదని, దోమలు ఎక్కువగా ఉండటంతో డెంగు జ్వరాలు వస్తున్నాయని వారు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వీటన్నిటినీ త్వరలోనే పరిష్కారం చేస్తామన్నారు. ఈకార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని మరి మాకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రంగోని మెట్టకు చెందిన మహబూబ్ బాషా పట్టణ శివారులో ఉన్న బైపాస్ రోడ్డులో జే న్యూ టౌన్ దగ్గర ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో మహబూబ్ భాష (28)అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలియజేశారు.

# విద్యార్థులు విద్యుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించడంతోపాటు అన్ని రంగాలలో రాణించి మంచి పౌరులుగా ఎదగాలని డిప్యూటీ ఈఓ కే.బాలాజీ పిలుపునిచ్చారు. మబ్బు సూర్యనారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ సోమవారం విద్యార్థులకు విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, దేశభక్తి గీతాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలకు పాఠశాలలో ఏర్పాటుచేసిన బహుమతి ప్రధానోత్సవములో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఈవో కే బాలాజీ, అర్బన్ ఎంఈఓ బి భాస్కర్ నాయక్ అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహనీయులు దేశ స్వాతంత్రం కోసం తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడి మహానుభావుడుగా నిలిచారని తెలిపారు. అలాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మబ్బు సూర్యనారాయణ రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు మునిశేఖర్, ట్రస్టు కోఆర్డినేటర్ రేవంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోడి బాపనగుంటలో ఆక్రమణలు తొలగించాలి

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** పెద్ద హరిజనవాడ సమీపంలో ఉన్న బోడి బాపను గుంట ఆక్రమణలను తొలగించాలని జగన్ జీవన్ రావు కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు జి బాలసుబ్రమణ్యం తాసిల్దార్ కు వినతి పత్రం సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వేటి నగరం మేజర్ పంచాయతీ పరిధిలో పూర్వ కార్వేటినగరం రాజుల కాలంలో రాజుల వారు ప్రజల సౌకర్యం కోసం అనేక కోనేరు చెరువులు గుంటలు నిర్మించారని, వీటిని ప్రజల అవసరాలు పంటలు సాగు చేసుకుంటూ ఉన్నారు. ఈ గుంటలో పశువులు తాగునీటి కోసం నిర్మించారు ఇందులో పూర్తిగా ఆక్రమించడంతో ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యుత్ శాఖ ఏడీఈగా చంద్ర నాయక్



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలం విద్యుత్ శాఖ ఏడిఈగా చంద్ర నాయక్ చంద్ర సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఏడీఈ నాగరాజు తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు.

## చౌడేపల్లి ఏపియంగా సుబ్రహ్మణ్యం



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలాకేంద్రానికి నూతనంగా వచ్చిన వెలుగు ఏపీఎం సుబ్ర మణ్యం సోమవారం తమ కార్యాలయంలో భాధ్యతలు స్వీకరిం చారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడంలో తన వంతుగా కృషిచేస్తానని ఆయన తెల్పారు. అనంతరం చౌడేపల్లి మాల మహానాడు నాయకులు ఏపీఎంను కలసి శుభాకాంక్షలు తెలియజేసి, దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, చౌడేపల్లి మండలాధ్యక్షులు కొత్తపల్లి మణి, ఉపాధ్యక్షులు కూరపర్తి ఈశ్వర్, నాయునివారిపల్లి రాము, రెడ్డిప్రసాద్, సురేష్, వాటర్ వాష్ మణి, సురేష్, డేవిడ్, రెడ్డెప్ప, ఆర్టిస్టు నరసింహులు ,సంఘమిత్రలు పాల్గొన్నారు.

## వారాహి భహిరంగ సభను జయప్రదం చేయండి



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** సనాతన ధర్మం కోసం తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సియం కొణిదల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జరగనున్న వారాహి భహిరంగ సభకు పుంగనూరు నియోజక వర్గం నుండి జనసేన కార్యకర్తలు, తెలుగుదేశం కార్యకర్తలు,భారతీయ జనతాపార్టి కార్యకర్తలు,నాయకులు వారాహి భహిరంగ సభను జయప్రదం చేయాలని జనసేన చౌడేపల్లి మండలాధ్యక్షులు బల్లాపురం పురుషోత్తం కోరడమైనది.

## క్రీడా పోటీలలో కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ




**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం నియోజకవర్గ స్థాయిలో కుప్పంలో గల ఎన్టీఆర్ క్రీడా మైదానంలో జరిగిన ఎస్‌జిఎఫ్ క్రీడలలో కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులలో ఎన్.నిఖిత - పదోవతరగతి విద్యార్థిని బ్యాడ్మింటన్ విభాగంలో, విధేయ్ ఏడోవ తరగతి,బ్యాడ్మింటన్ విభాగంలో చదరంగంలో ధనుష్ పదోవ తరగతి షాట్ పుట్ విభాగంలో సౌమ్య పదవ తరగతి -100 మీటర్లు పరుగుపందెంలో కాబట్టి విభాగంలో సౌమ్య పదవ తరగతి, నవ్య పదవ తరగతి, కోకో విభాగం నందు, నవ్య పదవ తరగతి, నేహాల్ ప్రణవ్ పదవ తరగతి, పూజిత ఎడోవ తరగతి, వాలీ బాల్ విభాగంలో ఎస్.కె.సమియ పదవ తరగతి,హాకీ విభాగం నందు ధనుష్ పదవ తరగతి, సిద్దార్థ్ పదవ తరగతి, ఇమ్రాన్ పదవ తరగతి, దీపక్ పదవ తరగతి, నితిన్ పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు ఎంపికైనట్లు పి ఈ టి వినయ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను నారాయణ పాఠశాల డీజీఎం కొండలరావు, చిత్తూరు జిల్లా నారాయణ పాఠశాల ఏజీఎం ఫణికుమార్, ఆర్ ఐ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, జొనల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఎ జి ఏం బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఎ ఓ నరేష్, ఎ డి ప్రదీప్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## వెలుగు ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన కృష్ణప్ప



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండలం వెలుగు ఏపీంగా కృష్ణప్ప బాధితులు చేపట్టారు ఇతను గతంలో పెద్దపంజాణి మండలంలో ఏపీఎంగా పనిచేశారు ఇతనితో పాటు సీసీలు నూర్ మహమ్మద్, ఎం హేమలత, చిన్న, వసంతమ్మ బాధ్యతలు చేపట్టారు.

## ఏపీటీఎఫ్ 80 వసంతాల కరపత్రాలు పంపిణీ



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు రేగంటి దేవానంద్. అధ్యక్షురాలు బి.సరిత ఆద్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో జడ్పీ హైస్కూల్ ఎగువ వీధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో అక్టోబర్ 6,7,8 తేది విజయ నగరంలో నిర్వహించే ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం 80 వసంతాలు వేడుకలు 20 వరాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలలో ప్రతి ఉపాధ్యాయులు పాల్గోని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేసి, వేడుకలకు ఆహ్వానించడం జరిగింది. ఈ మహాసభలలో పాల్గొనడానికి ఉపాధ్యాయులు కూడా సమ్మతి తెలియజేస్తూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట సుబ్బలక్ష్మి, పోతురాజు, చంద్రకళ, ముని కృష్ణారెడ్డి, సుచరిత, యశోద వినిత, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి కల్పించండి

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** గ్రామాలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామీణ యువతకు, మహిళలకు ఉపాధి దిశగా చర్యలు చేపట్టేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో గ్రామీణ పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకు ఛత్తీస్ ఘడ్ బృందంనకు చెందిన ప్రకార్ అడ్లె, సయ్యద్ పరవేష్, దేవేంద్ర సింగ్, పరిశ్రమల శాఖ డీడీ జవహర్ బాబుతో కలసి జిల్లాలో వ్యవసాయ అనుబంధల శాఖల ద్వారా గ్రామీణ వనరులను సద్వినియోగం చేసుకొని ఉపాది అవకాశాలు ఏర్పాటుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని కమ్యూనిటీ నేతృత్వంలో స్వయం సహాయక మహిళలకు, గ్రామీణ యువతకు ఉపాదిని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద చిత్తూరు, అల్లూరి సీతారామరాజు, కోనసీమ జిల్లాలను ఎంపిక చేసిందని ఇందులో భాగంగా ఛత్తీస్‌ఘడ్ బృందంతో అధ్యయనం చేయించేందుకు నిర్ణయించిందని, జిల్లాలో పాడి పరిశ్రమ, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉపాది అవకాశాలు ఏర్పరిచేందుకు జిల్లాలో గల వనరులు తదితర అంశాలపై చర్చించి క్షేత్ర స్థాయిలో బృందం పర్యటించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ అనుబంద శాఖల అధికారులు వారి శాఖలకు సంబందించి వ్యవసాయ రంగంలో వరి, వేరుశెనగ, చెరకు సాగు కలదని ఉద్యానవన శాఖకు సంబందించి మామిడి సాగు జిల్లాలో ఎక్కువగా కలదని, తరువాత టమోటా, ఆలూ సాగు కలదని, కుప్పంలో పండ్లు కూరగాయల సాగు ఎక్కువగా ఉంటుందని, పాడి పరిశ్రమకు సంబందించి పాల ఉత్పత్తి ద్వారా ఎక్కువ మంది రైతులు జీవనాధారం చేసుకుని ఉన్నారని, పౌల్ట్రీ పరిశ్రమలు కూడా కలదని, పట్టు పరిశ్రమలకు సంబందించి మల్బరీ సాగు కూడా పలమనేరు, వి.కోటలో కలదని, చేనేత పరిశ్రమ నగరి నందు విస్తరించిందని అధికారులు బృందానికి వివరించారు. వీటి ఆధారితంగా గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై ఛత్తీస్‌ఘడ్ బృందం రెండు విభాగాలుగా సంబందిత శాఖ అధికారులతో మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించనున్నారు. ఈ సమావేశంలో ట్రైనీకలెక్టర్ హిమవంశీ, జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళికృష్ణ, మధుసూధన రెడ్డి, డా. ప్రభాకర్, డిపిఓ లక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆహ్వానించారు. సోమవారం సాయంత్రం అమరావతిలోని సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు సమావేశమయ్యారు. అక్టోబర్ 4 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని చంద్రబాబు నాయుడుని ఆయన కోరారు. బ్రహ్మాచారి మొదటి రోజు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వస్తానని చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ సమావేశంలో ఆరణి మదన్ పాల్గొన్నారు.



# సీఎంఆర్‌ఎఫ్‌కి పెన్వర్ సంస్థ రూ.50లక్షలు విరాళం

**గూడూరు, మేజర్‌న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని పెన్వర్ ప్రొడెక్ట్స్ (రొయ్యల ప్రాసెసింగ్) సంస్థ వరద బాధితులకు సహాయర్థం రూ.50లక్షలు చెక్‌ను విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి అందచేశారు. గూడూరు డివిజన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పెన్వర్ ప్రొడెక్ట్స్ సంస్థ అధినేతలు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్‌తో కలసి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని సచివాలయం నందు కలసి విరాళం చెక్‌ను అందచేశారు. పెన్వర్ అధినేతలు మేనేజింగ్ డైరెక్టర్ ఫిలిప్స్ థామస్, డైరెక్టర్ గంటా మధు కృష్ణలు చెక్కును అందచేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం అందించిన పెన్వర్ ప్రతి నిధులను మానవనరుల శాఖ మంత్రి లోకేష్ అభినందించారు. విజయవాడ వరద బాధితులకు సహాయం అందించే కార్యక్రమంలో బీదా రవిచంద్ర ప్రసాద్ రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



# దసరా మహోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:**

బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు అక్టోబర్ 4వ తేదీ నుండి 12వ తేదీ వరకు దసరా మహోత్సవ ఆహ్వాన పత్రికను, అమ్మ వారి ప్రసాదంను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వారికి అందజేశారు. బోయకొండ ఈఓ ఏకాంబరం జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్ఓ బి.పుల్లయ్యలకు ఆహ్వాన పత్రికలను అమ్మ వారి ప్రసాదంను అందజేసి దసరా ఉత్సవాల్లో పాల్గొన వలసిందిగా బోయకొండ గంగమ్మ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఏకాంబరం కోరారు.

# పుంగనూరు పట్టణంలో కిడ్నాప్ కలకలం

**ఊబేదుల్ల కాంపౌండ్‌లో చిన్నారి అస్వియా మిస్సింగ్**

**డాగ్ స్క్వాడ్ తనిఖీలు ఆచూకీ దొరకని చిన్నారి అస్వియా**

**జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ పర్యవేక్షణ**

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఉభేదుల కాంపౌండ్‌లో నివాసం ఉన్న రియల్ ఎస్టేట్ ఫైనాన్స్ వ్యాపారి అజుముతుల్ల కుమార్తె ఏడేళ్ల చిన్నారి రెండో తరగతి చదువుతున్న అస్వీయ ఆదివారం రోజు సాయంత్రం ట్యూషన్ నుండి వచ్చి వారి ఇంటి వద్ద వీధిలో ఆడుతుండగా ఏడు గంటల సమయంలో కొద్దిసేపు విద్యుత్ అంతరాయం కలగడంతో తల్లిదండ్రులు చిన్నరి కోసం ఇంటి నుండి బయటకు వచ్చి చూడగా పాప కనపడకపోవడంతో చుట్టుపక్కల ఉన్న బంధువులతో కలిసి ఆ ప్రాంతమంతా వెతకడం జరిగింది కానీ పాపజాడ కనబడకపోవడంతో రాత్రి 9:30 గంటలకు పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. అయినా పాప ఆచూకీ తెలియకపోవడంతో జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ ఆదేశాల మేరకు రిస్క్‌టీం డాగ్‌స్క్వాడ్ ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టారు. 11 బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడ పాప ఆచూకీ కాన రాలేదు. దీనితో జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ ఆయనే స్వయంగా సాయంత్రం పుంగునూరు పోలీస్ స్టేషన్కు వచ్చి తమ డీఎస్పీలు సిఐలు, ఎస్సైలతో కలిసి పర్యవేక్షణ చేస్తూ జల్లెడ పట్టడం జరిగింది అయినను పాప ఆచూకీ కాన రాలేదు డాగ్ స్క్వాడ్ వెళ్ళిన ప్రాంతమంతా సీసీ కెమెరాలు చెక్ చేయడం జరిగింది. ఎక్కడ ఆచూకీ తెలియకపోవడంతో ఇంకను ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు చిన్నారి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో తిరుపతి జిల్లాలోని
కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.

**వెంకటగిరి నియోజకవర్గం :**

1. డక్కిలి, 2.బాలాయపల్లి

**సత్యవేడు నియోజకవర్గం :**

1.సత్యవేడు, 2. బి.ఎన్.కండ్రిగ, 3. నాగలాపురం,
4. పిచ్చాటూరు, 5. నారాయణవనం

**చంద్రగిరి నియోజకవర్గం :**

1.పాకాల, 2.చిన్న గొట్టికల్లు, 3.ఎర్రవారి పాలెం

కె.సురేష్‌బాబు
(బ్రాంచ్ మేనేజర్)
ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మినారాయణ
(రీజనల్ మేనేజర్)
ఫోన్ నెంబర్: 6301107116

## లక్ష్మీ నరసింహ విద్యాసంస్థల్లో ముందస్తు దసరా వేడుకలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ విద్యా సంస్థలో ముదస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయదశమి ప్రాముఖ్యత గురించి డైరెక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ విజయదశమి విజయాలకు చిహ్నంగా ఈ పండుగ జరుపుకుంటామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ధరించిన 9 మహాశక్తుల అవతారాలు పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించిది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేష్, ధనంజయ రేడ్డి,పురుషోత్తం, హెచ్ఎం, జమున, కృష్ణవేణి, కిషోర్, నిర్మల, చందు ప్రియ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు దసరా సెలవుల్లో ఉచిత శిక్షణ తరగతులు

**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్. పేరెంట్స్ (స్టెప్) ఆధ్వర్యంలో అక్టోబర్ 4 నుండి 6 తేదీల్లో మూడు రోజులపాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని స్టెప్ చిత్తూరు జిల్లా సమన్వయకర్త జోగి గురుమూర్తి తెలిపారు. ఉపాధ్యాయులు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులుగా కావడానికి ఈ శిక్షణా తరగతులు దోహదపడుతాయని తెలిపారు. విద్యార్థులలో ఉన్న మానసిక ప్రవర్తన లోపాలను సరిచేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపి తద్వారా వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులు కావాలన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో ఉన్న రమణా రావు, సావిత్రమ్మ ధ్యాన ఆశ్రమంలో ఉపాధ్యాయులు కుటుంబ సమేతంగా ఈ శిక్షణా తరగతులకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతులలో పాల్గొనే ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ, ఉచిత వసతి, ఉచిత భోజనఉచిత మెటీరియల్స్‌తో పాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వబడుతుందన్నారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొనదలచిన ఉపాధ్యాయులు స్టెప్ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు సెల్ నెంబర్ 9030644 440, ధర్మారెడ్డి సెల్ నెంబర్ 8143234555 లను సంప్రదించాలని సూచించారు.

## శాప్ చైర్మన్‌ను అభినందించిన చక్రి



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** రాష్ట్ర శాప్ చైర్మన్‌గా నియమితులైన రవి నాయుడును టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి కావలి చక్రి సోమవారం పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం చక్రి మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీకి అనుబంధంగా వారు చేసిన పోరాటాలను గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. శాప్ చైర్మన్‌గా ఎదగడానికి తెలుగు నాడు విద్యార్థి విభాగం ముఖ్య కారణమని ఆయన అన్నారు. అతను సేవలను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాప్ చైర్మన్గా నియమించడం శుభ పరిణామం అన్నారు.

## శిష్టా సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజ



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటి నగరం మేజర్ పంచాయతీ వెలసిన శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం ఆలయంలో అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మోహన్ రాజు, కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వరద బాధితుల విరాళాల కార్యక్రమం

**కుప్పం,మేజర్ న్యూస్:** సాయి మాతా సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలోసోమవారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం కుప్పం పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని బియ్యం, బట్టలు వరద బాధితుల సహాయర్థంగా అందించారు.కుప్పం ప్రజలు వరద బాధితుల సహాయార్థంగా బియ్యం , వంట సామాగ్రి ,బట్టలు విరివిగా వస్తువులను అందజేయాలని జగదీష్ బాబు కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎం.సి.సి విద్యార్థులు, అధ్యాపకులు షహీన్ త తాజ్ తదితరులు పాల్గొన్నారు.



## సృజనాత్మక, క్లిష్టమైన ఆలోచన విధానాన్ని పెంపొందించడానికి అవగాహన సదస్సు

**కుప్పం, మేజర్‌న్యూస్:** డా.వై.సీ. జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు "సృజనాత్మక, క్లిష్టమైన ఆలోచన విధానమును పెంపొందించుకొనుటకు అవగాహన సదస్సును మొదటి సంవత్సరం పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు "ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చాప్టర్" వారి తరఫున ప్రముఖ సైకాలజిస్ట్ మరియు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఉరవకొండ కళాశాల ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగపు అధిపతి డాక్టర్ వై సురేష్ బాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శిక్షణ తరగతులును సోమవారం నిర్వహించడం జరిగిందని కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సి.హెచ్ సుబ్బన్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాఫ్ట్ స్కిల్స్, ఆలోచన విధానము యొక్క ప్రాధాన్యతను వివరించారు. సుజనాత్మకత పెరగడానికి లెఫ్ట్ బ్రెయిన్, రైట్ బ్రెయిన్ ఇండ్ల మధ్య సమన్వయం ఏర్పడడానికి కావలసిన మెలకువలు తెలియజేస్తూ విద్యార్థినీ విద్యార్థులకు సృజనాత్మకత పెరుగుటకు వివిధ విధానాలతో వస్తువులతో శిక్షణ ఇవ్వడం జరిగింది అని తెలిపారు. నేటి విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని సోషల్ మీడియాకు మొబైల్ లకు దూరంగా



ఉండి ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్తు నందుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో జనరల్ సెక్షన్ ఇంచార్జ్ హెడ్ డాక్టర్ సయ్యద్ హుస్సేన్ మియాన్, ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రిక్ టానిక్స్ లెక్చరర్స్ నరసింహాలు, వీరంజన్, వరుణ్ జోసఫ్ , కెమిస్ట్రీ లెక్చరర్స్ డాక్టర్ జి ఎన్ రమేష్, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందిన టెక్నీషియన్‌కు సన్మానం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** టిటిడి ధర్మ ప్రచార పరిషత్ విభాగం అన్నమాచార్య కళామందిరంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తు సోమవారం పదవీ విరమణ పొందిన రమేష్ దంపతులను రాయలసీమ రంగస్థలి ఛైర్మెన్ గూండాల గోపినాథ్ పూలమాలలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలను రమేష్ టెక్నికల్ పరంగా ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. శ్రీవారి ఆశీస్సులతో పదవీ విరమణ తర్వాత ఆయన శేష జీవితం సంతోషకరంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్నమాచార్య కళామందిర్ కోఆర్డినేటర్ కోకిల ఇతర ఉద్యోగులు, ప్రతినిధులు ఆది గురుస్వామి, చిత్రపు హనుమంతరావు, టి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, దేసు నాగేశ్వరరావు, మల్లారపు రవి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



## రామచంద్ర యాదవ్‌కు సత్కారం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆర్ఆర్ యాదవ్ యూత్ నాయకులు ఘనంగా సత్కరించారు. శ్రీవారి ప్రసాదాలలో కల్తీ నెయ్యి కలిపారని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తిరుమల పరిరక్షణ పాదయాత్ర పుంగనూరులో ప్రారంభమైన యాత్ర సోమవారం తిరుపతికి చేరుకుంది. అలిపిరి వద్ద అఖిల భారతీయ యాదవ మహాసభ నాయకులు ఆర్ ఆర్ యాదవ్, శీను యాదవ్, ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించి స్వామివారి ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన శ్రీవారి ప్రసాదాలలో వినియోగించే నెయ్యిలో కల్తీ విషయంపై ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు రాజకీయాల స్వార్థం కోసం మాట్లాడడం దుర్మార్గమన్నారు. స్వామి ప్రసాదాలలో కల్తీ కి పాల్పడిన వారిని గుర్తించి ఇలాంటి తప్పులు మళ్లీ జరగకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తిరుమల శ్రీవారి మొదటి దర్శనం చేసుకునే యాదవ భక్తుని విగ్రహం అలిపిరి వద్ద ఏర్పాటుకు కృషి చేయాలని రామచంద్రా యాదవ్ కు వినతి అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ యాదవ భక్తుని విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆయన తిరుమలకు బయలుదేరు వెళ్లారు.

## దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**పలమనేరు, మేజర్‌న్యూస్:** వచ్చేనెల మొదటి వారం నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలకు విచ్చేయాలని పలమనేరు శాసనసభ్యులను ఎన్ అమర్నాథరెడ్డిని సోమవారం పలువురు ఆహ్వానించారు. చౌడేపల్లి మండలంలోని ప్రసిద్ధ బోయకొండ గంగమ్మ ఆలయ ఈవో ఏకాంబరం తీర్థ ప్రసాదాలను అందించి ఆహ్వానించారు. అదేవిధంగా వీ.కోట మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయ 13వ దసరా వేడుకలకు రావాలని దేవాలయ ధర్మకర్త మండలి సభ్యులు ఆహ్వానించారు. మరోవైపు పలమనేరు మండలంకల్లాడు, తొప్పనపల్లె, గంగవరం మండలంలోని మేలుమాయి మలాలమ్మ దేవి ఆలయ నవరాత్రి ఉత్సవాలకు విచ్చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో పలమనేరు సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్. వి. బాలాజీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు,వీ.కోట మండల పార్టీ అధ్యక్షులు రంగనాత్తదితరులు పాల్గొన్నారు.



## మహిళలుకు చీరలు వితరణ

**- జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా**

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** అక్టోబర్ 1 ఒకటవ తేదీ అంతర్జాతీయ వృద్ధులు దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీకాళహస్తి నియోజక వర్గ జనసేనపార్టీ ఇంఛార్జి వినుత కోటా పట్టణంలోని అమ్మా ఆశ్రమంలో వృద్ద మహిళలకి చీరలు వితరణ చేసి అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది వృద్దులకు ఆశ్రయం కల్పించి ఆదుకుంటున్న అమ్మా ఆశ్రమం నడుపుతున్న భూదేవిని అభినందించి. ప్రతి శుభ సందర్భంలో సేవా కార్యక్రమాలు అమ్మా ఆశ్రమం లో నిర్వహించడం సంతోషంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.



## వేంకటేశ్వర స్వామికి మొక్కులు చెల్లింపు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గెలవాలని కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామిని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్ మొక్కుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు నడిచి వెళుతూ మోకాలి మెట్టు వద్ద మోకాళ్ళతో ఎక్కుతూ తన మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వేడుకగా అశోక్- అంబేడ్కర్ దమ్మ యాత్ర

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** మానవ నిబద్ధత, సీతి వంతమైన జీవనానికి మార్గదర్శకం బౌద్ధమని, బౌద్ధర్మం పాటించడంతో మానసిక పరమైన ముక్తి పొందవచ్చని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. అశోక విజయదశమిని పురస్కరించుకొని బౌద్ధ సన్యాసులు, బుద్దిస్టులు కేరళ తిరువనంతరపురం నుంచి నాగహార్లోని బుసలా ప్రారంభించిన అశోక్- అంబేద్కర్ దమ్మ యాత్ర సోమవారం తిరుపతికి చేరుకుంది. ఈ దమ్మ యాత్రకు ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం సర్కిల్లో బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా, అంబేద్కర్ కమిటీ నేత పరమశివన్ ఆధ్వర్యంలో పలువురు దళిత సంఘాల నేతలు, ప్రజా సంఘాలు, బుద్ధిస్టులు పను స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి యాత్రను ప్రారంభించారు కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విచ్చేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం తోని నేడు ప్రపంచంలో పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలకు అంబేద్కర్ ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి కర్నాలవీధి, బేరివీధి, ప్రకాశం రోడ్డు మీదుగా అంబేద్కర్ భవన్ వరకు సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బంతేజ్లు, భిక్షువులు బుద్ధ వందం చేశారు. ఈ సందర్భంగా పి.పరమశివన్, బుదిస్టులు డాక్టర్ భాస్కర్ రావు, డాక్టర్ రాజమాణిక్యం, పి. ఇంద్రముని, ఎం.ప్రసాద్రావు మాట్లాడుతూ బౌద్ధధమ్మం వివక్షతలు, వైషమ్యాలు లేని సమ సమ సమాజానిక్కి ఆకాంక్షిస్తుందన్నారు. ప్రజ్ఞ, శీల, మైత్రి, స్వాతంత్ర్యం – సమానత్వం, సౌభ్రాతృత్వం, సాంఘిక న్యాయం, హేతుత్వం వంటి విశిష్ట లక్షణాలు ప్రాతిపదికగా బౌద్ధడున్ను ఆవిర్భవించిందని తెలిపారు. ఇంతటి మహోన్నత మైన బౌద్ధాన్ని అశోక చక్రవర్తి కలింగ యుద్ధానంతరం బౌద్ధుడు బౌద్ధవ్యాప్తికి ఆయన కృషి చేశారని తెలిపారు. అశోక్ చక్రవర్తి అనన్య కృషితో సకల జీవుల సౌకర్యార్థం చేసిన సేవా కార్యక్రమాలు చరిత్ర సత్యాలు బౌద్ధ ప్రచారానికి అనేక స్థూపాలు, వాటిపై బౌద్ధ మా ప్రోగాలు దేశ విదేశాలలో వ్యాపింపజేశారని తెలిపారు. బౌద్ధ విశిష్టతను దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగ నిర్మాత . ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ బుద్ధుని జన్మదినం, చక్రవర్తి అశోక్ విజయదశమి నాడు" తనతో పాటు లక్షలాది అనుచరులతో నాగపూర్లోని దీక్షా భూమి బౌద్ధాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. మలఖ రహిత సమాజం, మానవ ప్రశాంత జీవనానికి దిక్సూచిగా నిలిచిన బౌద్ధ ధర్మాన్ని పాటిస్తూ అందరూ సుఖ శాంతులతో జీవించాలని వారు కోరారు. కాగా తిరుపతి నుంచి దమ్మ యాత్ర బయలు దేరి విజయదశమి నాడు బౌద్ధ దీక్షా భూమికి చేరుకుంటుందని, ఈ యాత్రలో బహుజనులు, బుద్దిస్టులు పెత్త ఎత్తున భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు, బుద్దిస్టులు జి.ధనశేఖర్, కృష్ణయ్య, పుష్పరాజ్, మురళి, మురుగేషన్, చిరంజీవి, రాధాకృష్ణ, గాలి రవి, పి.అంజయ్య, గోవిందయ్య. గోపి, పున్నాక సురేష్, రెడ్డెప్ప, రాజేష్, రమేష్, జగదీష్ కుమార్ బంతేజీలు, బౌద్ధసన్యాసులు పాల్గొన్నారు.







# డైమండ్స్ జ్యువలరీ ప్రదర్శన ప్రారంభం

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** వసుంధర డైమండ్స్ జ్యువలరీ వారి ఆధ్వర్యంలో కెన్సెస్ హోటల్లో ఏర్పాటు చేసిన రెండు రోజుల డైమండ్స్ జ్యువలరీ ప్రదర్శనను సోమవారం మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్, విశాఖ, విజయవాడకు చెందిన వసుందర డైమండ్స్ జ్యువలరీ వారు ఏర్పాటు చేసిన ప్రదర్శనలో మగువలు మెచ్చే ఆధునాతనమైన డైమండ్స్, గోల్డ్ ఆభరణాలు ఆకట్టుకుంటున్నాయన్నారు. మధ్య తరగతి వారికి అందుబుటులో ఉండేలా డైమండ్స్. గోల్డ్ ఆభరణాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వసుంధర జ్యువలరీ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ డైమండ్స్ జ్యువలరీ ప్రదర్శనలో డైమండ్స్, గోల్డ్, కుందన్, పొల్కి వంటి అధునాతన డిజైన్ల అభరణాలతో పాటుర బ్రైడల్, వివిధ కార్యక్రమాలకు సంబంధించిన జ్యువలరీస్ లభిస్తాయని తెలిపారు.

# పక్క రాష్ట్రాల లిక్కర్ పై నిఘా

**– వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్**



**వాకాడు మేజర్ న్యూస్ :** పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా లిక్కర్ తీసుకుని వచ్చి అమ్మే వారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తామని వాకాడు ఎక్సైజ్ సీఐ ఆర్ యు వి ఎస్ ప్రసాద్ తెలిపారు. వాకాడు సిఐగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో సి ఐ మాట్లాడుతూ వాకాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో గంజాయి, ఇతర రాష్ట్రాల నుండి మద్యం, డ్రగ్స్ మత్తు వంటి పదార్థాలు తెలిసిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను ఆయన కోరారు, త్వరలో ఎక్సైజ్ పాలసీ నూతన విధానం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఆ క్రమంలోనే మరో ఒకటి రెండు రోజుల్లో కొత్త షాపులు కు టెండర్లు ప్రక్రియ నోటిఫికేషన్ వస్తుందన్నారు. రానున్న దసరా ఉత్సవాల్లో ఇతర రాష్ట్రాల నుండి లిక్కర్ తీసుకువచ్చిన, అమ్మిన, కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# దేవస్థానం గోశాల గోవులకు మేతగా పచ్చగడ్డి

## - తుక్కు గడ్డి... ఇష్టపడని గోవులు

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం గోశాల గోవులకు పచ్చగడ్డి తుక్కు వేసి సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులకు, సిబ్బందికి ఎప్పుడు ఏఆలోచన వస్తుందో తెలియడం లేదు. ఆలోచన వచ్చిందే తడవుగా అమలు చేసేస్తున్నారు. దానివల్ల ఫలితం ఉంటుందా లేదా అనే ఆలోచన ఏమాత్రం లేదు. ఆలయం వద్ద గోవులకు హైబ్రిడ్ పచ్చగడ్డి సరఫరా జరిగేది. భక్తులు 20 రూపాయలకు పచ్చగడ్డి కట్టను కొనుగోలు చేసి గోవులకు స్వయంగా తినిపించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే అధికారులకు, సిబ్బందికి ఎవరు సలహా ఇచ్చారో లేదా ఎవరు ఆలోచన చేశారో తెలియదు గానీ సోమవారం పచ్చగడ్డిని యంత్రంతో తుక్కు చేసి సరఫరా చేశారు. ఈ తుక్కును కొనుగోలు చేయడానికి భక్తులు ఇష్టపడడం లేదు. దాన్ని తినడానికి గోవులు కూడా సహకరించడం లేదు. ప్లాస్టిక్ బుట్ట నిండుగా 100 రూపాయలు, అర బుట్ట 50 రూపాయలుగా సిబ్బంది అమ్ముతున్నారు. హైబ్రిడ్ పచ్చగడ్డిని గోవులు తిని మొదలు కండెలను మాత్రం విడిచి పెట్టేవి. అయితే కండెలతో కలిపి తుక్కు చేసి అందిస్తున్నారు. దీన్ని తినడానికి గోవులు అయిష్టత చూపుతున్నాయి. గోవులకు పచ్చగడ్డి తుక్కును అందించాలనే



ఆలోచన ఎవరిదో తెలీదుగానీ ఇన్చార్జి ఇఓ చంద్రశేఖర్ ఆజాద్‌కు తెలిసి జరిగిందా. తెలియక జరిగిందా అనేది కూడా తెలియడం లేదు. దీనిపై ఇన్చార్జి ఈవో విచారణ జరిపించి. ఇటువంటి ప్రయోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం గోశాల గోవులకు నాణ్యమైన పచ్చ గడ్డి సరఫరా చేయాలని శివయ్య భక్తులు కోరుతున్నారు.

# జాతీయస్థాయి క్రీడలలో రాణించాలి : శాప్ చైర్మన్ రవి నాయుడు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** జాతీయస్థాయి క్రీడలలో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో క్రీడాకారిణిల అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులకు జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తామని తెలియజేశారు.కళాశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడలలో పథకాలు సాధించిన విద్యార్థినిల సమగ్రంగా రాణిస్తున్నారని, గ్రాప్లింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ మూడో స్థానంలో విద్యార్థులు నిలిచారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థినిలను శాప్ చైర్మన్ అభినందించారు. గ్రామీణ స్థాయి నుంచిజాతీయ స్థాయిలో క్రీడలలో రావడం గర్వించదగ్గ విషయమని, క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని తెలిపారు. ఇప్పుడే క్రీడా చైర్మన్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించానని, క్రీడలలోని సమస్యలన్నింటికీ



పరిష్కార దిశగా అడుగులు వేస్తామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ క్రీడల్లో గర్వించే దగ్గ రాష్ట్రంగా ఎదిగేలా ప్రణాళికలు రూపొందిస్తామని విద్యార్థుల్లో చక్కటి స్ఫూర్తిని, ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతి, కళాశాల క్రీడాకారినిలు, నందనం ఫౌండేషన్ డైరెక్టర్, ఎస్వీ యూనివర్సిటీ సాంస్కృతిక విభాగ అధ్యక్షులు డా. పత్తిపాటి వివేక్, తెలుగునాడు యువత అధ్యక్షులు వాసు, డా. స్నేహలత, డా.జయమ్మ, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్, ఎన్ సి సి విద్యార్థినులు పాల్గొన్నారు.



# దోమల వృద్ధిని అరికడదాం

**జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్**

**చిత్తూరు అర్బన్ మేజర్ న్యూస్:** దోమల వృద్ధిని అరికట్టి మలేరియా రహిత సమాజాన్ని నిర్మించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ సూచించారు. సోమవారం నగరం లోని స్థానిక మురుకంబట్టు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో గల జీ కే కాలనీ ఏరియాలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ గారి ఆధ్వర్యంలో డెంగు సస్పెక్టెడ్ కేస్ సందర్భంగా ఇంటి ఇంటి ఫీవర్ సర్వే, లార్వాలు సర్వే నిర్వహించి లార్వాలను గుర్తించి వాటిని తొలగించి తొలగించలేని చోట పిచికారి చేయించడం జరిగింది. దోమ పుట్టకూడదు దోమ కుట్టకూడదు అనే నినాదంతో డెంగీ, మలేరియా, చికున్ గున్యా మొదలగు జ్వరాలు ప్రబలకుండా ఇంటి లోపల ఇంటి ఆవరణలో వుండే కంటైనర్స్ అన్ని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని మన పనికిరాని వస్తువులు ఉదాహరణకు పాత టర్లు, పగిలిన కుండపెంకులు, టెంకాయ చిప్పలు,ప్లాస్టిక్ వస్తువులు మొదలగు వాటిని ఇంటికి దూరంగా వేయాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలని సాయంత్రం వేళల్లో వేపాకు పొగవేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్లు రామకృష్ణ, శివ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎమ్ లు, ఆషా కార్యకర్త పాల్గొన్నారు.